TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony, Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 230 | మంగళవారం 10 డిసెంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



## కలైంజర్ శతాబ్ది ప్రత్యేక సంచిక విడుదల

**విల్లివాకం న్యూస్:** చెన్నై సచివాలయంలో స్పీకర్ అప్పావు నేతృత్వంలోని కమిటీ రూపొందించిన 'శాసనసభ వీరుడు- కలైంజర్' శతాబ్ది ప్రత్యేక సంచికను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విడుదల చేశారు. తమిళనాడు ప్రభుత్వం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో ఇలా పేర్కొంది. తమిళ నాడుకు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా, 13 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు కలైంజర్ కరుణా నిధి. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయన శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించా లని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 22.05.2023న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సంప్రదింపుల సమావేశం అనంతరం మంత్రులు, స్పీకర్ అప్పారావు నేతృత్వంలో 12 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కమిటీలలో, స్పీకర్ అప్పావు నేతృత్వంలోని "శాసనసభ్యుడు-కళాకారుడు" బృందం "జాతీయ కళాకారుడి శాసనసభ ద్వారా సామాజిక ప్రగతి సాధించిన శతాబ్ది విద్యార్థులను నిమగ్నం చేయడం" అనే అంశంపై చెన్నైలో సెమినార్ నిర్వహించింది. అలాగే తమిళనాడు వ్యాప్తంగా 120 కళాశాలలు, పాఠశాలల్లో కమిటీలు సెమినార్లు నిర్వహించాయి. ఈ సెమినార్‌లకు సుమారు 600 మంది విద్యార్థులు హాజరై ప్రసంగించారు. కలైంజర్ కరుణానిధి శత జయంతి ముగింపు సందర్భంగా చెన్నై సచివాలయంలో స్పీకర్ అప్పావు నేతృత్వంలోని కమిటీ రూపొందించిన 'శాసనసభ వీరుడు- కలైంజర్' శతాబ్ది ప్రత్యేక సంచికను ముఖ్య మంత్రి ఎం.కె.స్టాలిన్ విడుదల చేయగా, దానిని జలవనరుల శాఖ మంత్రి, అసెంబ్లీ స్పీకర్ దురైమురుగన్ అందుకున్నారు.

## ఏవిపిఎన్ సౌత్ ఆసియా సమ్మిట్ 2024



**విల్లివాకం న్యూస్:** ఆసియాలో అతిపెద్ద సామాజిక పెట్టుబడిదారుల నెట్‌వర్క్, ఏవిపిఎన్ భారతదేశంలోని చెన్నైలో తన దక్షిణాసియా సదస్సు 2024ను సోమవారం ప్రారంభించింది. వాతావరణ చర్య, ఆరోగ్యం ప్రభావం, యువత సాధికారత మరియు జీవనోపాధి మరియు లింగ సమానత్వంలో ప్రభావవంతమైన పరిష్కారాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా దక్షిణాసియా సామాజిక సవాళ్లను పరిష్కరించడంపై సదస్సు దృష్టి సారించింది. రెండు రోజుల సదస్సు ఈ ప్రాంతం యొక్క అత్యంత ముఖ్యమైన సామాజిక-ఆర్థిక మరియు పర్యావరణ సమస్యలను లక్ష్యంగా చేసుకుని పరిష్కారాలు కనుగొనేందుకు వీలు కల్పిస్తుంది.ఇందులో భారత ప్రభుత్వం, నీతి ఆయోగ్, సింగపూర్ యూనివర్శిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్, బ్లూ ప్లానెట్, రిలయన్స్ ఫౌండేషన్ వంటి సీనియర్ అధికారులతో సహా పలువురు పాల్గొన్నారు. కుమారగురుబరన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్‌బీ సుప్రియా సాహు, తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి, ఇన్నోసెంట్ దివ్య, మేనేజింగ్ డైరెక్టర్, నాన్ ముదల్వన్, తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవిపిఎన్ సీఈఓ నైనా సబర్‌వాల్ బాత్రా మాట్లాడుతూ, సౌత్ ఏషియా సమ్మిట్ 2024 సందర్భోచిత దృక్పథాలను అభివృద్ధి చేయడానికి మరియు వినూత్న, స్థానికీకరించిన పరిష్కారాలను సహ-సృష్టించడానికి ఒక కీలక వేదిక అన్నారు. బ్లూ ప్లానెట్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రశాంత్ సింగ్ వ్యాఖ్యానిస్తూ వాతావరణ చర్యలకు వ్యర్థాల నిర్వహణ చాలా కీలకం, ముఖ్యంగా దక్షిణాసియాలోని జనసాంద్రత కలిగిన నగరాల్లో. వ్యర్థాలను ఒక వనరుగా చూడడం ద్వారా, మేము ల్యాండ్‌ఫిల్‌లను తగ్గించడం మరియు పునర్వినియోగం చేసే వినూత్న పరిష్కారాలను కనుగొన్నామన్నారు.

## మదురై టంగ్‌స్టన్ మైన్ వ్యతిరేకంగా అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం ఏకగ్రీవ ఆమోదం



**గిండీ న్యూస్ :** తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. మదురైలో టంగ్‌స్టన్ మైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, అన్ని పార్టీల మద్దతుతో ప్రత్యేక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. తీర్మానంపై చర్చ సమయంలో ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి పలు ప్రశ్నలు అడగగా, వాటికి నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ మరియు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమాధానమిచ్చారు. దీనితో అసెంబ్లీలో వాడివేడి చర్చ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్స్ పేజీలో ఇలా వ్యాఖ్యానించారు: "పార్లమెంటులో గనులు, ఖనిజాల సవరణ బిల్లుకు మద్దతుగా ఓటేసిన ఎడప్పాడి పళనిస్వామి, అసెంబ్లీలో తమిళనాడు సంక్షేమం గురించి మాట్లాడుతున్నట్లు నటించడం అనేది అన్నాడీఎంకే ద్రోహ చరిత్రకు మరో ఉదాహరణ. ద్రవిడ మున్నేట్ర కజగం ఎప్పటికీ తమిళనాడుకు నష్టం కలిగించే ప్రాజెక్టులను అనుమతించదు."

## టంగ్‌స్టన్ మైన్- తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రజల సంబరాలు



**గిండీ న్యూస్ :** మదురై జిల్లా మేలూరు సమీపంలోని అరిటపట్టితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో టంగ్ స్టన్ మైన్ ఏర్పాటుకు హిందుస్థాన్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు సమాచారం. దీన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. అరిటాపట్టి ఇప్పటికే జీవవైవిధ్య ప్రదేశంగా ప్రకటించబడింది. ఈ ప్రాంతంలో టంగ్ స్టన్ మైన్ ఏర్పాటు చేస్తే పర్యావరణం దెబ్బతింటుంది. ప్రజల జీవనోపాధి కూడా ప్రశ్నార్థకమే. కావున టంగ్ స్టన్ మైనింగ్ మంజూరు చేయరాదని కోరుతూ ముత్తు వేల్పట్టి, కిటారిపట్టి, ఎట్టిమంగళం, చెట్టి యారపట్టి, నాయకర్‌పట్టి, వెల్లాలపట్టి, అరిటాపట్టి పరిసర ప్రాంతాలతో పాటు 50 మందికి పైగా గ్రామస్తులు గత నెల రోజులుగా అనేక నిరసనలు చేస్తున్నారు. ఈ కేసులో మదురై టంగ్ స్టన్ మైనింగ్ లైసెన్స్ ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో మదురై జిల్లాలోని వెల్లిమలయాండి ఆలయం దగ్గర నిరసన తెలిపిన ప్రజలు మిఠాయిలు అందించి, పటాకులు పేల్చి తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బొర్రా గోపీమూర్తి జయకేతనం

**కాకినాడ:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుపై ఆయన గెలుపొందారు. అయితే దీన్ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో తొలి నుంచే బొర్రా గోపీమూర్తి ఆధిక్యంలో కొనసాగారు. చివరికి 9,165 మొదటి ప్రాధాన్య ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆయన్ను పీడీఎఫ్ బలపరిచింది. గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు వచ్చాయి. మొత్తం 15,494 ఓట్లకు గాను 14,680 పోలయ్యాయి. వీటిలో 814 చెల్లని ఓట్లుగా ఎన్నికల అధికారులు గుర్తించారు. బొర్రా గోపీమూర్తి విజయం సాధించడంతో ఆయన వర్గీయులు సంబరాలు చేసుకుంటున్నారు.

## త్వరలో ఏపీ కేబినెట్‌లోకి నాగబాబు



**అమరావతి:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఏపీ క్యాబినెట్‌లో చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం వెలువడనున్నట్లు తెలుస్తోంది. జనసేనలో చురుగ్గా వ్యవహరిస్తున్న నాగబాబు.. ప్రస్తుతం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆయనకు మంత్రి పదవి కేటాయించే అంశంపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఏపీలో అసెంబ్లీ స్థానాల సంఖ్యను అనుసరించి.. 25 మంత్రి పదవులకు అవకాశం ఉంది. కానీ, ప్రస్తుత మంత్రివర్గంలో 24 మంది ఉన్నారు. జనసేన నుంచి ప్రస్తుతం పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ మాత్రమే మంత్రులుగా ఉన్నారు. కానీ, కూటమి పొత్తుల్లో భాగంగా జనసేనకు 4, భాజపాకి ఒక మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంది. భర్తీ కావాల్సిన ఆ ఒక్క స్థానం జనసేన నుంచి ఖరారు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాగబాబును మంత్రిమండలిలోకి తీసుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మరోవైపు, ఏపీ నుంచి ఖాళీ ఏర్పడిన మూడు రాజ్యసభ స్థానాలకు భాజపా నుంచి ఒకరిని, తెదేపా నుంచి ఇద్దర్ని ఎంపిక చేయాలని కూటమి అధిష్ఠానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆర్. కృష్ణయ్య పేరును భాజపా ఇప్పటికే ఖరారు చేయగా.. తాజాగా తెదేపా నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ పేర్లు ఖరారయ్యాయి. ఇటీవల బీద మస్తాన్ రావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయగా.. మళ్లీ ఆ స్థానాన్ని తెదేపా ఆయనకే కేటాయించింది. మోపిదేవి వెంకటరమణ స్థానాన్ని భర్తీ చేసేందుకు సానా సతీష్‌ను అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ ముగ్గురు కూటమి అభ్యర్థులు మంగళవారం నామినేషన్ వేయనున్నారు. ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషికి బెదిరింపు కాల్స్: విచారణలో పోలీసులు



**అమరావతి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేషీకి వచ్చిన బెదిరింపు కాల్స్ సంచలనం రేపాయి. ఫోన్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి పవన్ కల్యాణ్‌ను చంపేస్తామంటూ హెచ్చరికలు చేశారు. అభ్యంతరకర భాషలో మాట్లాడడంతో పాటు, అతని నుంచి కొన్ని మెసేజ్‌లు కూడా వచ్చినట్లు సమా చారం. పేషీ సిబ్బంది ఈ విషయాన్ని వెంటనే ఉప ముఖ్యమంత్రికి నివేదించారు. పవన్ కల్యాణ్ సూచన మేరకు ఈ వివరాలను పోలీసు ఉన్నతాధికారులకు అందజేశారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తుండగా, బెదిరింపు కాల్స్ వెనుక ఉన్న వ్యక్తిని గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. సాధారణంగా రాజకీయాల్లో పెరుగుతున్న విమర్శల నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసుపై గట్టిగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.

## వీసీకే-విజయ్ మధ్య ఎటువంటి విభేదాలు లేవని తిరుమావళవన్ స్పష్టం



**అన్నా నగర్ న్యూస్:** తమిళనాడు శాసనసభ సమావేశం అనంతరం, లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా (వీసీకే) అధినేత తిరుమావళవన్ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను సచివాలయంలో కలిశారు. గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే కారణంతో విశాఖ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆధవ్ అర్జున్‌ను ఆరు నెలల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయడం చర్చకు కారణమైంది. ఈ సందర్భంగా తిరుమావళవన్ విలేకరులతో మాట్లాడుతూ:ఫెన్జల్ తుఫాను నష్టం: తుఫానులో తమిళనాడు ప్రజలు భారీగా నష్టపోయారని, కేంద్రం సహాయం అందించలేదని విమర్శించారు. సహాయ నిధులు: వీసీకే తుఫాను బాధితులకు రూ. 10 కోట్లు అందించిందని తెలిపారు. ఆధవ్ అర్జున్ వ్యవహారం: ఆయన అనుచిత వ్యాఖ్యలు పార్టీ విశ్వసనీయతకు నష్టం కలిగించాయని అన్నారు. విజయ్‌తో సంబంధాలు: "వీసీకే మరియు తమిళనాడు వెట్రి కజగం మధ్య ఎటువంటి విభేదాలు లేవు. విజయ్‌తో కూడా ఎలాంటి సమస్యలు లేవు" అని స్పష్టం చేశారు.

## పశువుల మేత భూములను కాపాడండి!




**విల్లివాకం న్యూస్:** ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని పశువుల మేత భూములను కాపాడవలసిందిగా ద్రావిడ దేశం అధ్యక్షులు వి. కృష్ణా రావు ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీం అంసారియాను కోరారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మానెపల్లి, అయ్యగానిపల్లె, సిద్ధినపాలెం తదితర గ్రామాలలో పశువులు, గొర్రెలు, మేకల మేతకు ఉపయోగిస్తున్న సర్వే నెంబర్ 152 మరియు 152/2 నెంబర్ గల ప్రభుత్వ భూములను ఇటీవల కొందరు కబ్జాదారులు స్థానిక రాజకీయ నాయకులు, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 370 ఎకరాల భూమిలో ఇప్పటికే 182 ఎకరాలను ఆన్ లైన్ లో రిజిస్టర్ భూమిగా పొందుపరచడం జరిగింది. వాస్తవానికి ఈ భూములన్నీ శోత్రియ, కొండ పోరంబోకు, అగ్రహారం భూములుగా స్థానిక గ్రామ రికార్డులలో పొందుపరిచి ఉన్నాయి. ఈ మాములనే గాక ఆ గ్రామాలలోని కొండలు గుట్టలను కూడా ఈ భూకబ్జాదారులు జెసిబి లతో చదును చేస్తున్నారు. ఈ చర్యలను వ్యతిరేకించిన ఆ గ్రామాల ప్రజలు ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "స్పందన" లో రెండు వారాల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. ఆ గ్రామాల ప్రజలందరూ మార్కాపురం సబ్ కలెక్టర్ వారిని కలిసి వాస్తవాలను వివరించగా సబ్ కలెక్టర్ గారు వెంటనే స్పందించి ఇది పశువుల బీడు కాబట్టి ఎవరూ ఈ భూములను రిజిస్టర్ చేయడానికి వీలులేదని హెచ్చరించి జెసిబి, బుల్ డోజర్లను అక్కడి నుండి వెంటనే పంపివేసారని రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. కానీ ఆక్రమణదారులు ఇవేవీ పట్టించుకోకుండా తమ కార్యక్రమాలను కొనసాగించారు. వెంటనే రైతులు స్థానిక తహసిల్దార్ ను కూడా కలిసి పిర్యాదు చేసినా అటువైపు నుండి ఎటువంటి చర్యలు లేని కారణంగా భూకబ్జాదారులు మరింత పెట్రేగి పోయి రైతుల పైనే అక్రమంగా పోలీసు కేసులు పెట్టి వారిని బెదిరిస్తున్నారని రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. ఇదే విదంగా ప్రకాశం జిల్లాలోని అనేక మండలాలలో పశువుల మేతకు కేటాయించిన భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయని మా దృష్టికి వచ్చింది. ఉదాహరణకు జిల్లా హెడ్ క్వార్టర్ కు అతి దగ్గరగా ఉన్నటువంటి టంగుటూరు మండలం వల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 91: 94: 95:36 నందు అన్యాక్రాంతం అయినటువంటి పశువుల బీడు మరియు అసైన్ ల్యాండ్లను రెవెన్యూ అధికారుల అండదండలతో భూభకాసుదులు రికార్డ్ టాంపరింగ్ జరిపి వారు అనుభవంలో సుమారు 200 ఎకరాలు పేదలకు సంబందించిన భూమిని అగ్రవర్ణాల వారు అనుభవించుచున్నారు. ఇదేవిధంగా వివిధ గ్రామాలలోని రైతులు ఇటువంటి పశువుల మేతకు ఉపయోగపడే భూములను కొందరు రాజకీయ నాయకులు స్వాధీనం చేసుకుంటున్నారని పశువులు, మేకలు, గొర్రెలు మేపుకునే రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. కాబట్టి కలెక్టర్ గారు ఈ విషయంలో ప్రత్యేక దృష్టిసారించి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో ఆక్రమణకు గురైన పశువుల బీడు ప్రభుత్వ భూములను మండలాల వారీగా జాబితా సిద్ధం చేసి అన్యాకృతమైనటువంటి భూములను కాపాడి రైతులకు జీవనాధారంగా ఉన్న పశువులు, గొర్రెలు, మేకలకు మేతకు ఉపయోగపడేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నట్లు వినతి పత్రంలో తెలిపారు.



## పిల్లలకు వినికిడి పరికరాల వితరణ

**విల్లివాకం న్యూస్:** ప్రముఖ సామాజిక కార్యకర్త, గుడ్ డీడ్స్ క్లబ్ స్థాపకురాలు అప్సర రెడ్డి మద్రాస్ ఈఎన్ టి రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ మోహన్ కామేశ్వరన్ సహకారంతో వినికిడి లోపం ఉన్న పిల్లలకు 30 అధిక-నాణ్యతగల వినికిడి పరికరాలను వితరణగా అందజేశారు. ఈ అత్యాధునిక పరికరాలు యువ గ్రహీతలకు కమ్యూనికేషన్ మరియు అభ్యాసానికి కొత్త తలుపులు తెరవడమే కాకుండా వారి జీవన నాణ్యతను బాగా మెరుగుపరుస్తాయి. ఈ సందర్భంగా అప్సర రెడ్డి మాట్లాడుతూ వినగల సామర్థ్యం మనలో చాలా మందికి చాలా తక్కువగా ఉంటుంది, కానీ ఈ పిల్లలకు, వారు ఎన్నడూ తెలియని ప్రపంచానికి ఇది ఒక ద్వారమని, నేడు, తాము ఈ వినికిడి పరికరాలను అందిస్తున్నందున, ధ్వనిని మాత్రమే బహుమతిగా ఇవ్వడం లేదని, గ్రహించడానికి, పరిమితులు లేకుండా కలలు కనే అవకాశాన్ని ఇస్తున్నామని తెలిపారు. గిండిలోని పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమం పరివర్తన శక్తికి సాక్షిగా నిలిచింది.

## సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంక్ కొత్త గవర్నర్‌గా నియమితులు




**న్యూఢిల్లీ:** సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త గవర్నర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం డిసెంబర్ 10తో ముగియనుండగా, డిసెంబర్ 11 నుంచి సంజయ్ మల్హోత్రా ఆర్‌బీఐ గవర్నర్‌గా తన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. కేంద్ర రెవెన్యూ కార్యదర్శిగా తన సేవల ద్వారా ప్రశంసలు అందుకున్న మల్హోత్రా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన వచ్చే మూడు సంవత్సరాల పాటు ఈ కీలక పదవిలో కొనసాగుతారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సంజయ్ మల్హోత్రా ఆర్థిక రంగంలో విస్తృత అనుభవం కలిగి ఉండగా, ఆయన నాయకత్వంలో ఆర్‌బీఐ అనేక కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఈ నియామకం ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపనుంది.




## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**విల్లివాకం న్యూస్:** ఈసీఐ కన్నడపాలయం తెలుగు ఆలయం నందు జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో పెద్దలు, సంఘ విశ్వాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సండే స్కూల్ టీచర్ల సహకారంతో ఆదివారం జరిగిన చిల్డ్రన్స్ సెమీ క్రిస్టమస్ లో బాల యేసు జన్మదిన మహోత్సవాన్ని కొనియాడారు. ఈ సమయంలో సంఘ కాపరి ఊటుకూరి జీవరత్నం మాట్లాడుతూ మత్తయి 14:9 యేసు పలికిన మాటలను బట్టి బోధించారు. చిన్నపిల్లల గురించి ప్రసంగిస్తూ ఈనాడు అనేక ప్రాంతాలలో అనేక ఆలయాలలో సండే స్కూల్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కొన్ని చోట్ల తల్లిదండ్రులు సరిగా ఆలయానికి పంపించడం లేదని, దేవుని మందిరానికి పంపితే వారు పెరిగి పెద్దవారైనా చెడిపోరని అన్నారు. ఆలయానికి పంపకపోతే బిడ్డలు దొంగలుగా మారుతారని, అనేక చెడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు .క్రైస్తవులు తమ పిల్లలను సండే స్కూల్ కు పంపాలని ప్రభువు పేరిట కోరారు.





# ఏపీలో టోల్ మోత

- 16 నగరాల్లో రోడ్లకు టోల్ ట్యాక్స్
- సిద్ధమవుతున్న కూటమి ప్రభుత్వం
- పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధి

**అమరావతి:** ఏపీలో జాతీయ రహదారులతో సమానంగా రాష్ట్ర రహదారులు సైతం టోల్ బాదుడుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో ఎంపిక చేసిన రహదారులను అభివృద్ధి చేసి వాటిపై టోల్ మోత మోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా అధికారులు ముందుగా 16 నగరాల్లో రోడ్లను ఎంపిక చేశారు. వాటిని అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికకు త్వరలో ప్రభుత్వం ఆమోదముద్ర వేయబోతోంది.

**పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధి :** రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల (కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు) పరిధిలో రోడ్లను పీపీపీ విధానంలో (కాంట్రాక్టర్ రోడ్డు వేసి టోల్ ట్యాక్స్ వసూలు చేసుకోవడం) అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అధికారులు తొలుత 16 నగరాల్లో ఉన్న 642.90 కిలోమీటర్ల మేర రోడ్లను ఎంపిక చేశారు. వీటి అభివృద్ధి, నిర్వహణకు త్వరలో టెండర్లు పిలుస్తారు. అనంత రం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పని ప్రారంభిస్తారు.

**విశాఖపట్నంలోనే అత్యధికం..** రాష్ట్రంలో ఇలా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిన మొత్తం 642.90 కిలోమీటర్ల రోడ్లలో విశాఖపట్నంలోనే అత్యధికంగా 253.05 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. నెల్లూరులో 83 కిలోమీటర్లు, గుంటూరులో 60 కిలోమీటర్లు, కాకినాడలో 39 కిలోమీటర్లు, విజయ నగరంలో 33 కిలోమీటర్లు, చిత్తూరులో 29 కిలో మీటర్లు, కడపలో 28 కిలోమీటర్లు, అనంతపురంలో 21 కిలోమీటర్లు, తిరుపతిలో 19 కిలోమీటర్లు, విజయవాడలో 17 కిలోమీటర్లు, శ్రీకాకుళంలో 12 కిలోమీటర్లు, మచిలీపట్నంలో 11 కిలోమీటర్లు ఉన్నాయి. కర్నూలు, రాజమండ్రిలో 7 కిలోమీటర్ల చొప్పున, ఏలూరులో 5 కిలోమీటర్లు ఉన్నాయి.

**టెండర్ విధానంలో కాంట్రాక్టర్లకు..** కాంట్రాక్టర్లకు టెండర్ విధానంలో రహదారులను అప్పగిస్తారు. అనంతరం కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణంతో పాటు పదేళ్ల పాటు దాని నిర్వహణ చూడాల్సి ఉంటుంది. మధ్యలో మరమ్మతులు అవసరం వచ్చినా వారిదే బాధ్యత. అలాగే వీటిపై టోల్ ట్యాక్స్ తో పాటు ప్రకటనల ద్వారా కూడా ఆదాయం సంపాదించుకునే అవకాశం వారికి కల్పిస్తారు. మొత్తంగా ఇప్పటివరకు జాతీయ రహదారులపైనే ఉన్న టోల్ బాదుడు.. ఇప్పుడు రాష్ట్ర రహదారులకు కూడా తప్పేటట్లు లేదు. రోడ్డెక్కాలంటేనే వాహనదారుడు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# ఈ పార్లమెంటు సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు



జమిలి ఎన్నికలపై మరో ముందడుగు పడనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లేదంటే వచ్చే సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. ఆ తర్వాత దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ.. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేపీసీ సంప్రదింపులు జరపడంతోపాటు అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలని సూచిస్తూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమర్పించిన నివేదికకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఒక దేశం-ఒకే ఎన్నికల విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని కోవింద్ కమిటీ పేర్కొంది. అయితే, దీనికోసం పలు రాజ్యాంగ సవరణలను కమిటీ సిఫార్సు చేసింది.

జమిలి ఎన్నికల ప్రతిపాదనలపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 30కిపైగా పార్టీలు దీన్ని సమర్థించగా.. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వడం లేదని.. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే చెబుతున్నారు.

ఇదిలాఉంటే, దేశంలో పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు గతంలోనూ జరిగాయి. 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలే జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడంతో మధ్యంతర ఎన్నికలొచ్చి జమిలి మాయమైంది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వీటన్నింటినీ రాబోయే సార్వత్రిక ఎన్నికలతో కలపాలంటే.. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడమో..మరికొన్నింటికి తగ్గించడమో చేయాల్సి ఉంటుంది.

# బంగ్లాదేశ్‌కు భారత విదేశాంగశాఖ కార్యదర్శి..



**ఢిల్లీ :** ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తడంతో చర్చలు జరిపేందుకు భారత కార్యదర్శి విక్రమ్ మిశ్రి బంగ్లాదేశ్‌కు వెళ్లారు. ఆ దేశ విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్‌తో ఆయన కీలక అంశాలను చర్చించే అవకాశం ఉంది. సోమవారం ఉదయం భారత వాయుసేన విమానంలో విక్రమ్ ఢాకా చేరుకొన్నారు. బంగ్లాదేశ్‌లో ఆయనకు విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి స్వాగతం పలికారు.

ఆ తర్వాత మిశ్రి-మహమ్మద్ జషీముద్దీన్‌లు చర్చలు జరిపారు. ఇక ఈ పర్యట నలో భాగంగానే మిశ్రి బంగ్లాదేశ్ తాత్కాలిక విదే శాంగ మంత్రి మహమ్మద్ తౌహిద్ హొసాన్‌తో చర్చలు జరపనున్నారు. అదే సమ యంలో ఆ దేశ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనుస్‌తో కూడా ఫోన్ కాల్‌లో మర్యాద పూర్వకంగా మాట్లాడను న్నారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు తీవ్రమైన వేళ మిశ్రి పర్యటన చోటు చేసుకోవడం గమనార్హం. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. దీనికి నిరసనగా పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. ఇటీవల త్రిపురలోని అగర్తలాలో ఉన్న బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిష నర్ కార్యాలయం ముందు వందల మంది ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆఫీస్‌ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వీరిద్దరూ ఢాకా నుంచి పని చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. కోల్‌కతాలోని డిప్యూటీ హైకమిషనర్ షిక్దార్ మహ మ్మద్ అష్రఫుల్ రహ్మాన్, అగర్తలలోని అసిస్టెంట్ హైకమిషనర్ ఆరిఫ్ మహమ్మద్‌ను రీకాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశం కూడా మిశ్రి పర్యట నలో చర్చకువచ్చే అవకాశం ఉంది. అంతేకాదు.. బంగ్లాదేశ్ దళాలు భారత సరిహద్దుల్లో డ్రోన్ల మోహరింపు తదితర అంశాలపై ఇరు వర్గాలు తమ అభిప్రాయాలను పంచుకొనే అవకాశం ఉంది.

## చంపేస్తామని హెచ్చరిస్తూ.. పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు వచ్చాయి. బెదిరింపు కాల్స్, సందేశాలు వచ్చిన విషయాన్ని అధికారులు.. పవన్ కల్యాణ్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

With best compliments from
Rtn, J.S.K. Naidu
Proprietor
9840066772



NATIONAL INDUSTRIAL SECURITY AGENCY
Specialized in security services
The best & Reliable Security Services for
Institutions
Industries
Commercial Offices
Apartments
Bungalows
Hospitals
Banks
Bouncer Ceremonial Functions & Events



JSK SECURITY SERVICES (P) LTD
Specialized in investigation of



Matrimonial
Thefts
Finger Prints
Pre & Pro Bio Data of Employees
Company records of Employees
NISA SECURITY
No.28/24, 1st Main Road, Jai Nagar, Arumbakkam, Ch-106
Ph: 044-43531187 | Mobile: 98400 39394 | 98400 28888
E-Mail: nisaagency01@gmail.com
15

# తెలుగువారి జీవధారకు 69 వసంతాలు



**విజయపురిసౌత్:** నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రేపటితో 69 ఏళ్లు నిండుతాయి. ఆనాడు నెహ్రూ కన్న కలలను నిజం చేస్తూ కోట్లాది మంది ప్రజలకు జీవనాధారంగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అన్నపూర్ణగా ఆధునిక దేవాలయంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు విరాజిల్లుతోంది. 1955 డిసెంబర్ 10న ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆయన మాట్లాడుతూ ఈనాడు నాగార్జున సాగరానికి నేనిక్కడ జరిపే శంకుస్థాపనను పవిత్ర కార్యంగా పరిగణిస్తున్నాను. ఇది భారత ప్రజా సౌభాగ్య మందిరానికి జరుగుతున్న శంకుస్థాపన. ఈనాడు మనం ఆసేతుహిమాచల పర్యంతం నిర్మించుకుంటున్న నవదేవాలయాలకు ఇది చిహ్నం' అని అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో పూర్తిస్థాయిలో మానవశక్తితో నిర్మితమైన ప్రాజెక్టు నాగార్జునసాగర్. సాగునీటి కోసం కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. కుడికాలువను జవహర్ కాలువగా, ఎడమకాలువను లాల్‌బహదూర్ కాలువగా పిలుస్తారు. జవహర్ కాలువ సాగర్ రిజర్వాయర్ నుంచి ఆనకట్టకు కుడివైపు నుంచి



ప్రారంభమవుతుంది. ఈ కాలువ పనులను అప్పటి ఆంధ్రరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న ప్రారంభించారు. దక్షిణ విజయపురి (రైట్‌బ్యాంకు) వద్ద ఈ కాలువ సొరంగ మార్గం ద్వారా ప్రారంభమై 392 కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. ఈ కాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11లక్షల 74వేల 874 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. రిజర్వాయర్ ఎడమవైపు నుంచి ప్రారంభమయ్యే కాలువకే లాల్‌బహదూర్ కెనాల్ అని పేరు. ఈ కాలువ పొట్టిచెలమ నుంచి చలకుర్తి వరకు సొరంగ మార్గం ద్వారా ప్రయాణిస్తుంది. ఈ కాలువ నిర్మాణాన్ని ఆనాటి గవర్నర్ భీమ్‌సేన్ సచార్ 1959లో ప్రారంభించారు. ఈ కాలువ పొడవు 349కిలోమీటర్లు. ఈ కాలువ కింద 10 లక్షల 37వేల 796 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. రిజర్వాయర్ నీటిమట్టం 489 అడుగుల పైన ఉన్నప్పుడు కుడికాలువలాగే ఈ కాలువకు కూడా నీటిని విడుదల చేయవచ్చు. సాగర్ ప్రాజెక్టు ఒకసారి నిండితే ప్రభుత్వానికి 20 వేల కోట్ల రూపాయలకు పైచిలుకు ఆదాయం వస్తుందని అంచనా. 1967 ఆగస్టు 4న నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాలువలకు నీటిని వదిలారు.



# గగన విహారం

**పాడేరు** : మెలికలు తిరిగే ఘాట్ రోడ్డు, ఎటుచూసినా ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, రంగురంగుల పూల మొక్కలు. మంచు దుప్పట్లో ప్రకృతి అందాలు. ఇలా భూతల స్వర్గాన్ని తలపించే అరకు అందాలను ఆకాశవీధిలోంచి వీక్షించేందుకు పాడేరు ఐటీడీఏ హాట్ ఎయిర్ బెలూన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన దీనిపై విహరించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. పది నిమిషాలు ఆకాశంలో విహరించేందుకు ఒకొక్కరి నుంచి రూ. 1500 వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 244 మంది విహరించగా 3.66 లక్షల ఆదాయం వచ్చింది. దీనిని పాడేరు ఐటీడీఏ, ఈగల్ ఫ్లై కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇక్కడ రెండు హాట్ ఎయిర్ బెలూన్లు అందు బాటులో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పారామె టార్లను కూడా కంపెనీ ప్రతిని ధులు సిద్ధం చేశారు. ఇందుకుగాను గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. పాడేరు ప్రాంతానికి చెందిన కొంతమంది నిరుద్యోగులు ఢిల్లీలోని గురుగామ్‌లో హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటార్ ఫ్లయింగ్‌లో శిక్షణ పొందారు. వీరంతా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

## ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం

**ఢిల్లీ** : ప్రపంచవ్యాప్తంగా ప్రతి పెట్టుబడి దారుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన 'ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2024'లో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనుంది. "రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్సఫార్మ్ మంత్రంగా భారత్ చేసిన అభివృద్ధి ప్రతి రంగంలోను కనిపిస్తోంది. గత పదేళ్లలో భారత్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల నుంచి 5వ స్థానానికి చేరింది. గత పదేళ్లలో ఆర్థికవ్యవస్థ మారడంతో ఎగుమతులు రెట్టింపు అయ్యాయి. ఇక ఎఫ్‌డీఐలు కూడా రెండింతలు పెరిగాయి. ఈ సమయంలో దేశంలో ఇన్ఫ్రాపై వ్యయాలు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు చేర్చాము. భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం మనకు పెద్ద ఉపయోగం. మరికొన్నేళ్లపాటు మనం అత్యంత యువ దేశంగా ఉండనున్నాం. ఇక్కడే అత్యధిక మంది నైపుణ్యవంతులైన యువకులు ఉంటారు. ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం. గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది. ఇక డిజిటల్ చెల్లింపుల్లో భారీగా పుంజుకొంది. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు రాజస్థాన్ అభివృద్ధి, సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. అందుకే ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. 'వికాస్ భీ-విరాసత్ భీ' మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాజస్థాన్‌లోని పరిస్థితులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు బాగా నేర్చుకొంటారు. భారత్‌లో అతిపెద్ద సోలార్ పార్కుల్లో చాలా వరకు ఇక్కడే ఏర్పాటవుతున్నాయి. డ్రైపోర్టులకు ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశం. రెండు ఎయిర్ కార్గో కాంప్లెక్సులు కూడా ఏర్పాటుచేశాం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ తొలుత మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగినట్లు తెలిపారు. అనంతరం వ్యాపారవేత్తలు బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా, మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా, వేదాంత రిసోర్స్ వ్యవస్థాపకులు అనిల్ అగర్వాల్ ప్రసంగించారు.



## ఆప్ రెండో జాబితా విడుదల

**ఢిల్లీ:** వచ్చే ఏడాది ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటికే తొలి జాబితాను విడుదల చేసిన అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ తాజాగా తమ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా పేరు ప్రకటించారు. అయితే ఆయన ఎప్పుడూ పోటీ చేసే పటపఢ్ గంజ్ స్థానం నుంచి కాకుండా జంగ్‌పురా నుంచి పోటీ చేయడం గమనార్హం. ఎన్నోఏళ్లుగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ స్థానం నుంచి ఇటీవల ఆప్‌లో చేరిన ప్రముఖ యూపీఎస్సీ కోచ్ అవధ్ ఓజా పోటీ చేయనున్నారు. మనీలాండరింగ్‌తో ముడిపడిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో 17 నెలలుగా తిహాడ్ జైలులో ఉన్న సిసోదియా ఆగస్టులో విడుదలయ్యారు. ఇదిలాఉంటే.. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీని ముందుకునడిపిస్తున్నారు. ఆప్ నేత ఆతిశీ ఢిల్లీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా ఢిల్లీ మంత్రిగా పనిచేసిన కైలాశ్ గహ్లోత్ ఇటీవల భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

## సందేహాలు పెరిగాయ్.. విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాలి

**విశాఖపట్నం:** విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన అసెంబ్లీ సభా సంఘం సోమవారం విశాఖ డెయిరీని పరిశీలించింది. ఎమ్మెల్యే నెహ్రూ ఆధ్వర్యంలో సభ్యులు విశాఖ డెయిరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ఆదేశాలతో డెయిరీని పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలన తర్వాత సందేహాలు మరింత పెరిగాయని, నిపుణుల కమిటీ సహకారం తీసుకుంటామని చెప్పారు. విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజులను సభ్యులుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు హౌస్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. "హౌస్ కమిటీ పరిశీలన సమయంలో డెయిరీ ఛైర్మన్ హాజరు కాలేదు. మాతో కేవలం ఎండీ మాత్రమే మాట్లాడారు. విశాఖ డెయిరీ 4 జిల్లాల పరిధిలో ఉంది. ఆయా జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తాం. పాడి రైతులకు




నష్టం జరగకుండా నిర్ణయం తీసుకుం టాం. మా కమిటీ నివేదికను అసెంబ్లీకి అందిస్తాం" అని జ్యోతుల నెహ్రూ చెప్పారు. స్పీకర్ ఆదేశాలతోనే విశాఖ డెయిరీపై హౌస్ కమిటీ వేసినట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. డెయిరీ విషయంలో అనేక అనుమానాలు, సందేహాలు ఉన్నాయ న్నారు. పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారంటున్నారని, యాజమా న్యం మాత్రం అదేమీ లేదని చెబుతోందని మీడియాకు తెలిపారు. డెయిరీని హౌస్ కమిటీ మరోమారు పరిశీలిస్తుందని తెలిపారు.

## ఆర్జీవీపై తొందరపాటు చర్యలొద్దు

**అమరావతి** : టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో తాజాగా విచారణ జరిగింది. ఏపీలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని ఆయన ఇప్పటకే హైకోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. తనపై కావాలనే కేసులు పెడుతున్నారని పలు ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆయన ఆశ్రయించారు. దీంతో వారం క్రితం వర్మకు ఊరట కల్పిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వర్మపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని పేర్కొన్న విషయం తెలిసిందే. వర్మపై ఏపీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. తాజాగా కోర్టులో విచారణ జరిగింది. గతంలో వర్మకు ఊరట కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను శుక్రవారం వరకు పొడిగించింది. ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గతంలో చెప్పిన వ్యాఖ్యలను మరోసారి కోర్టు ఆదేశించింది. వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానంలో రేపు విచారణ జరగనుంది.సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో ఏపీ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో వర్మ ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.




